పల్లెల్లో పనులు కరువు

ప్రారంభమైన రబీ మాసూళ్లు
- యంత్రాలతోనే వ్యవసాయ పనులు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- అధిక రేట్లు వసూలు చేస్తున్న కోత యంత్రాల యజమానులు


వరికోత యంత్రం

రాయచోటి జగదాంబసెంటర్ : ఒకప్పుడు రెండో పంట మాసూళ్లంటేనే రెండు నెలలకు పైబడి సాగుతుండేవి. కోతలు, కట్టేతలు, కుప్ప నూర్పిళ్లు, ధాన్యం ఎగరుబోతలు ఇలా రైతులు తీరుబడిగా రబీ పంట పనులు చేసుకుంటుండేవారు. కానీ ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన యాంత్రీకరణ పుణ్యమా అని మాసూళ్ల ప్రారంభమైన నెలలోపే రైతులు ధాన్యాన్ని అమ్మేసుకుని వచ్చిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు. రెండో పంటలో రెండు నెలలకు పైగా పనులు చేసుకుని గ్రామాల్లో కూలీలు కూలీ డబ్బులు తెచ్చుకునే వారు కానీ యంత్రాలతో మాసూళ్ల వచ్చిన తరువాత వారికి పనులు లేకుండా పోయాయి.

పెద్ద ఎత్తున వరి కోత యంత్రాలు రాక

ఈ సారి రబీ మాసూళ్ల సీజన్ ప్రారంభంలోనే పెద్ద ఎత్తున వరి కోత యంత్రాలు వచ్చాయి. కర్ణాటక, తమిళనాడు, పశ్చిమబెంగాల్, తెలంగాణ రాష్ట్రాలతో పాటుగా ఏపీలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లా నుంచి కూడా వరి మాసూళ్ల యంత్రాలు వచ్చాయి. ఏటా పలు ప్రాంతాల్లో రెండో పంటలో వరి సాగు చేస్తుంటారు. సాధారణంగా ఏప్రిల్ మొదటి వారంలో మాసూళ్లు ప్రారంభించి దాదాపుగా మే నెలాఖరు వరకు సాగేవి. ఈసారి సాగునీటి ఎద్దడి కారణంగా ఏప్రిల్ చివరి వారంలో కోతలు ప్రారంభించారు. ప్రారంభం నాటి నుంచి యంత్రాలతోనే రైతులు మాసూళ్లు చేస్తున్నారు. గతంలో కోతలు కోసి కుప్పలు నూర్చి ధాన్యాన్ని ఇంటికి తీసుకువచ్చేసరికి ఒక ఎకరానికి రైతుకు సుమారుగా కూలీ రేట్లను బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చయ్యేది.

ప్రస్తుతం యంత్రాలతో వసూళ్లు చేస్తుండటంతో ఆ ఖర్చు తగ్గిందనే చెప్పాలి. ఎకరానికి యంత్రాల ద్వారా మాసూళ్లకు దాదాపుగా రూ.7 వేల నుంచి రూ.8,500 వరకు ఖర్చవుతోంది. గత ఏడాది వరి కోత యంత్రానికి ఎకరానికి గంటకు రూ.2500 నుంచి రూ.2600గా తీసుకునే వారు. కాగా ఈ సారి రూ.2800 నుంచి రూ.3 వేలకు పెంచేశారు. గ్రామాల్లో కూలీ పనులు చేసుకుని బతికే వారికి యంత్రాలు వచ్చి గండికొట్టాయి. దాదాపుగా 2 నెలల పాటు వ్యవసాయ పనులు చేసుకునే వారు. సీజన్ ప్రారంభంలో ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.700 వరకు రోజు కూలి దక్కేది. ప్రస్తుతం కోతలు, కుప్పనూర్పిళ్ల లేకపోవడంతో కూలీలకు పనులు కరువయ్యాయి. కేవలం యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని ఎండబెట్టుకునేందుకు కూలి పనులకు వెళ్లాల్సి వస్తుంది. అది ఎకరానికి ఇద్దరు కూలీలు రెండు రోజుల పాటు మాత్రమే ధాన్యాన్ని ఎండబెట్టేందుకు పనిచేస్తున్నారు. ఏటా వరికోత యంత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పనులు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో కూలీలు ప్రత్యామ్నాయాన్ని వెతుక్కోవాల్సి వస్తుంది.

90 శాతానికి పైగా యంత్రాలతోనే



ఈసారి పెద్ద ఎత్తున యంత్రాలు వచ్చాయి. దీంతో పనులు త్వరగా అయిపోయి, రబీలో అనుకున్న విధంగా దిగుబడి రాకపోవడటం, గిట్టుబాటు ధర కూడా లేకపోవడంతో తగ్గిన మాసూళ్ల ఖర్చులు కొంతలో కొంత కలిసి వచ్చినట్లే.

– వేంపల్లి వాసుదేవరాజు, వాయల్‌రాజుగారిపల్లె, కుర్నూతల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

ఏటా పనులు తగ్గుతున్నాయి



యంత్రాలు రావడంతో రెండో పంటలో ఏటా పనులు తగ్గుతూనే వస్తున్నాయి. 20 రోజుల్లో మొత్తం పనులు పూర్తయి పోతున్నాయి. కూలీల్లో సగానికి పైగా పనులు ఉండటం లేదు. దీంతో వేరే మార్గాల్లో పనులు చూసుకోవాల్సి వస్తుంది.

– మేతకల రామనరసింహులు, వాయల్‌రాజుగారిపల్లె, కుర్నూతల గ్రామం, లక్కిరెడ్డిపల్లె మండలం

క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

రాజంపేట టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి వర్కింగ్ జర్నలిస్టుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రాజంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బచోటి భాస్కర్, ఉపాధ్యక్షుడు శివయ్యనాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత్రికేయులు విధి నిర్వహణలో ఒత్తిడికి లోనై అనారోగ్య బారిన పడుతున్నారని అందువల్ల ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరాజు నేతృత్వంలో వైద్య నిపుణులు అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బాధ్యతల స్వీకరణ


జె.నరసింహారెడ్డి, ఎస్‌ఐ

వీరబల్లి : మండల ఎస్‌ఐగా జె.నరసింహారెడ్డి సోమవారం వీరబల్లి పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య సైబర్ క్రైమ్ సెల్ నుంచి బదిలీపై వీరబల్లికి వచ్చారు. ఈయన గతంలో సుండుపల్లి, రాయచోటి ఎస్‌ఐగా పని చేశారు. వీరబల్లిలో పనిచేస్తున్న ఎస్‌ఐ మోహన్ నాయక్ సీపీఎస్ రాయచోటికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణ కోసం పనిచేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

రాయచోటి అర్బన్ ఎస్‌ఐ-2గా బాలకృష్ణ



రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ-2గా బాలకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పీలేరు పీఎస్ (పోలీస్ స్టేషన్) నుంచి బదిలీపై రాయచోటికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

నైనాథేశ్వరుడికి పూజలు



పెనగలూరు : మండల కేంద్రంలో ఉన్న పురాతన కాలం నాటి నైనాథేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి శేఖర్ స్వామిల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ప్రజలు పాల్గొన్నారు. స్వామి వారిని మల్లెమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అలాగే కామాక్షి దేవిని మహిళలు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన


ర్యాలీ తీస్తున్న ఏపీఎం రెడ్డమ్మ, రైతులు

చిన్నమండెం : ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై రైతులకు అవగాహన కల్పించినట్లు ఏపీఎం రెడ్డమ్మ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ సంఘం-2లో రైతులకు గ్రామసభ నిర్వహించారు. గ్రామంలోని చౌడుకుంట వీధిలో ర్యాలీ నిర్వహించి ఆదర్శ రైతుల విజయగాథలపై అవగాహన కల్పించారు. పీఎండీఎస్ వేయడం వలన లాభాలు, ప్రయోజనాల గురించి విపులంగా వివరించి, పాంప్లెట్స్ పంచి గోడ పత్రాలను అంటించారు. ఈ కార్యక్రమంలో సీసీ రెడ్డన్న, వీఓఏ హీన, వీఏఏ మహర్షి, ఎంటీఎల్ చందురెడ్డి, ఎంటీఎస్ పద్మావతి, శ్రీనివాసులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రుణ దరఖాస్తుల గడువు పెంచాలి

పెనగలూరు : ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణ దరఖాస్తుల గడువును ప్రభుత్వం పెంచాలని మండలంలోని ఎస్సీ, ఎస్టీలు కోరుతున్నారు. ఈనెల 10వ తేదీ దరఖాస్తుల గడువును ప్రభుత్వం ప్రకటించగా 8వ తేదీ నుండి సర్వర్ పనిచేయడం లేదన్నారు. మూడు రోజుల ముందే సర్వర్‌ను నిలిపివేశారని, వెంటనే రుణాలకు దరఖాకాస్తు చేసుకునేందుకు గడువును పెంచాలని ఎస్సీ, ఎస్టీలు కోరుతున్నారు.

వీసీని నియమించాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీకి వెంటనే రెగ్యులర్ వీసీని నియమించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం ఓంశాంతి నగర్ లో ఆ పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైవీయూలో గత కొన్ని నెలలుగా రెగ్యులర్ వీసీ లేకపోవడంతో సమస్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. ఇన్చార్జ్ వైస్ ఛాన్స్‌లర్ నియమించడం వల్ల కేవలం పది రోజులకు ఒకసారి మాత్రమే యూనివర్సిటీకి వచ్చి వెళ్లిపోతుంటారన్నారు. ఇంత పెద్ద యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ లేకపోవడం బాధాకరమన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

పెనగలూరు : మండల బీజేపీ మండల కమిటీ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ ఎన్నికల నిర్వహణకు రైల్వేకోడూరు అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చెంగల్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షులుగా కోనేటి రెడ్డి కృష్ణ, ఉపాధ్యక్షులుగా సోమేశ్వర చంద్రమోహన్, కోడూరు పెంచల సాయి, కోనేటి శ్రీనివాసులు, చెవ్వ వెంకటరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిగా మోహన్ యాదవ్, తిప్పన వెంకటరమణ, కార్యదర్శులుగా చాపల తిరుపాల్, ఆరీఫ్, ఖాజా మొహిద్దీన్, కమ్మయ్యగారిపల్లి శివప్రసాద్, మండల కోశాధికారిగా ఇనుగోలు నవీన్ కుమార్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల ఇన్‌చార్జ్ తోట నాగేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయచోటి జగదాంబసెటర్ (రామాపురం) : రామాపురం మండలం కల్పనాయునిచెరువు మూగిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు జనార్దన్‌రెడ్డి తండ్రి పుల్లారెడ్డి ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నాడు. వారి నివాసానికి సోమవారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి వెళ్లి పుల్లారెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువు


మాట్లాడుతున్న దండు గోపి

రాజంపేట టౌన్ : కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరవైందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ విభాగం నాయకుడు దండు గోపి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం గోపి విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థిపై అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తి సభ్యసమాజం తలదించుకునేలా అతి దారుణంగా కొట్టి, హింసించిన సంఘటన మరుకవ ముందే రాజకీయ కక్షతో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. రాజా అనే వ్యక్తి నందిగం సురేష్ ఇంటిపైకి వచ్చి దుర్భాషలాడిన రాజాపై కేసు నమోదు చేయకపోగా రాజా పెట్టిన కేసు ఆధారంగా సురేష్‌ను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనూ దళితులకు కూటమి ప్రభుత్వం నాయకుల నుంచి రక్షణ లేకుండా ఉందని, దీంతో దళితులు భయంతో బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఇదే రీతిన పాలించివుంటే అసలు టీడీపీ అన్నదే ఉండేది కాదన్నారు. ఐదేళ్ల క్రితమే టిడిపి కార్యాలయానికి టూలెట్ బోర్డు పెట్టేవారన్నారు. అయితే జగన్ కక్షపూరిత రాజకీయాలకు తావులేంకుండా కేవలం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పాలన సాగించారన్నారు. చంద్రబాబునాయుడి లాగా జగన్ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడి ఉంటే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి ప్రత్యర్థి పార్టీ అన్నదే లేకుండా ఉండేదని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు పోలీసులను అడ్డుపెట్టుకొని చేస్తున్న అరాచకాలకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. బాబు మాటలు విని సామాన్య ప్రజలను, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టే పోలీసు, ఇతర శాఖల అధికారులను వైఎస్సార్‌సీపీ 2.0 ప్రభుత్వంలో వదిలే ప్రసక్తే ఉండదని జగన్ చెబుతూనే ఉన్నారన్నారు. అందువల్ల పోలీసు, ఇతర శాఖల అధికారులు ఇప్పటికైనా ప్రభుత్వానికి జీహుజూర్ అనడం మానుకొని ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల ఎస్సీ సెల్ నాయకులు దాసరి పెంచలయ్య, గొంటు మణి, రెడ్డయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సిద్దవటం : మండలంలోని మాధవరం పంచాయతీ పరిధిలోని ఎస్‌కేఆర్ నగర్‌లో వెలసిన శ్రీ భదావతి భావనారాయణస్వామి ఉత్సవ మూర్తులకు ఆదివారం రాత్రి వేద పండితులు వైభవోపేతంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం చేయించి పట్టువస్త్రాలతో అలంకరించి వేదికపై కొలువు తీర్చారు. అనంతరం వేద పండితులు కల్యాణోత్సవంలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలతోపాటు మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి కార్యాక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి కళ్యాణం రంగరంగ వైభవంగా జరిపించారు. కొందరు భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

డీఈఓ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయండి


సమీక్ష చేస్తున్న అన్నమయ్య జిల్లా ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రాయచోటి : ఈనెల 21వ తేదీన వైఎస్సార్ కడప కేంద్రంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. సోమవారం రాయచోటిలో ఎస్టీయూ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక అన్నమయ్య జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.జాబిర్, శివారెడ్డి, నరసింహులు, వెంకటేశ్వర్లు, రెడ్డప్ప రెడ్డి, రవిశంకర్‌ల అధ్యక్షతన సమావేశమై ఈ మేరకు తీర్మానం చేశారు. ఉపాధ్యాయల బదిలీ చట్టంలోని అసంబద్ధతలను, పాఠశాల పున:వ్యవస్థీకరణకు సంబంధించిన నిబంధనలను సవరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చిందన్నారు. 117 జీఓను రద్దు చేయమని రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వం 117 జీఓ రద్దు పేరుతో గతంలో ఆరు రకాలుగా ఉన్న పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించిందన్నారు. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తెలిపారు. పాఠశాల స్థాయిలో ఉన్న పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా పాఠశాలలను పున:వ్యవస్థీకరణ ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ పోస్టులు మిగులుగా చూపించారని పేర్కొన్నారు. దీంతోపాటు మూడు, నాలుగు, ఐదు తరగతులను తరలించి మోడల్ స్కూల్ పేరుతో ఏర్పాటు చేయడం వల్ల అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోవడంతోపాటు చిన్న పిల్లలు కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఇతర ప్రాంతాలను చేరుకోవడం కష్టతరంగా మారిందన్నారు. బదిలీ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ప్రతిపాదనలపై పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మోడల్ స్కూళ్లకు ఇస్తామంటున్న ప్రధానోపాధ్యాయుల పోస్టులకు ఎస్‌జీటీ నుంచి పదోన్నతులు కల్పించి ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని సవరించి 45 మంది విద్యార్థులకు రెండో సెక్షన్ వచ్చే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు రవీంద్రనాథ్ రెడ్డి, జగదీష్, జాఫర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలకు వందనం

పెద్దతిప్పసముద్రం : దేశం కోసం త్యాగాలు చేస్తున్న సైనికులకు వందనం...వారికి మనమంతా బాసటగా నిలుద్దాం అంటూ మండల కేంద్రంలో ప్రజలంతా నినాదాలు చేశారు. మండల కేంద్రంలో సోమవారం కూటమి నాయకులు జాతీయ జెండాలను చేతబట్టి తిరంగ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల ధ్వంసమే లక్ష్యంగా భారత త్రివిధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో సైనికులకు సంఘీభావంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు శ్రీకాంత్, మల్లెం శివయ్య, కార్యం శంకర్, రియాసత్ అలీఖాన్, సిమెంట్ శీనా, కిరణ్, వెంకట్రమణ, సికిందర్, కిట్టన్న, చిన్నా, రామాంజులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మొఘల్ చక్రవర్తుల చరిత్ర తొలగించడం తగదు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వం మరోసారి తాజాగా సెంట్రల్ స్టడీస్ కు సంబంధించిన ఏడో తరగతి సోషల్ సబ్జెక్టులో మొఘల్ చక్రవర్తుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను పూర్తిగా తొలగించడం తగదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజమెత్తారు. కడప కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం ముస్లిం మైనార్టీల పట్ల విద్వేషంతో ఎంతో ప్రాశస్త్యం కలిగిన మొఘలుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలోని ఎన్సీఈఆర్టీ ఇటీవల ఏడవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు కేంద్ర సిలబస్ లో సదరు చరిత్రను తీసివేసినట్లు ప్రకటించడం దారుణమన్నారు.

సమసమాజ స్థాపనకు పుచ్చలపల్లి విశేష కృషి


రాజంపేట టౌన్: సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు


రాయచోటి టౌన్: రోగులకు పండ్లు అందజేస్తున్న సీపీఎం నాయకులు

రాజంపేట టౌన్ : కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య కులమతాలకు అతీతంగా పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పెట్టుకొని సమసమాజ స్థాపన కోసం జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప మహనీయుడని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్వేలి రవికుమార్ తెలిపారు. పట్టణంలోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకను రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాముల కుటుంబంలో పుట్టి తన ఆస్తినంతా పేదలకు పంచి సామాన్యమైన జీవితం గడపడమే కాక పిల్లలు పుడితే తనలో స్వార్థం ఏర్పడుతుందని పిల్లలను కూడా వద్దనుకొని తన చివరి శ్వాస వరకు పేదల కోసమే జీవించిన మహోన్నతమైన వ్యక్తిత్వం సుందరయ్య సొంతమన్నారు. సమాజంలో కుల, మత బేధాలు ఉండకూడదన్న గొప్ప ఆశయంతో తనపేరు వెనుక రెడ్డి అనే పదాన్ని కూడా తొలగించుకొని, ఆదర్శంగా జీవించిన సుందరయ్య అందరికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. కిరాణా కొట్టు పెట్టి కనీసం ఒక్కపైసా ఆదాయం లేకుండా పేదలకు సరుకులు అందించిన గొప్ప మనసున్న వ్యక్తి పుచ్చలపల్లి అన్నారు. పార్లమెంటుకు సైతం సైకిల్‌పై వెళ్లి తన నిరాడంబరతను చాటుకున్నారని పేర్కొన్నారు. కూలీ సంఘాలను ఏర్పాటు చేసి కనీస వేతనాలు, పంటలకు గిట్టుబాటు ధర కోసం పోరాటాలు సాగించి కూలీలకు, రైతులకు న్యాయం జరిగేలా చేశారని తెలియజేశారు. పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి, రాజకీయాలకు కొత్తమార్గాన్ని చూపి సమాజానికి మార్గదర్శిగా నిలిచిన పుచ్చలపల్లిని స్మరించుకోవడం మన అదృష్టమన్నారు. అంతకుముందు సుందయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, మస్తాన్, బి.సిద్దమ్మ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబరుడు పుచ్చలపల్లి సుందరయ్య

రాయచోటి టౌన్ : నిరాడంబరుడు, సోషలిస్టు, పీడిత వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎ.రామాంజులు అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన పార్టీ మనుగుడకు ఎంతో కృషి చేశారని చెప్పారు. పార్లమెంట్‌కు సైతం ప్రజాధనం వృథా చేయకుండా సైకిల్‌పై వెళ్లి కమ్యూనిస్టుల విలువలు పెంచిన నిరాడంబరుడు అన్నారు. పార్లమెంట్‌లో సామాజిక న్యాయం అంటే ప్రతి ఒక్కరూ తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు, కట్టుకోవడానికి బట్ట ఉండాలని తెలుగులో గళం విప్పిన మొదటి ప్రతిపక్ష నేతగా అందరి మన్ననలు పొందారని చెప్పారు. ఆయన జీవితం ఆదర్శవంతంగా తీసుకొని సోషలిస్ట్ సాధనకు అందరూ కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేశ్వర రాజు, కిరణ్, సీపీఎం నాయకులు నాగబసిరెడ్డి, రామచంద్ర, సీఐటీయూ నాయకులు ఎ.రమణ, సుబ్రహ్మణం రాజు, బీవి రమణ, లోహిత్, గీత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రచయితకు సన్మానం


రచయితను సన్మానిస్తున్న దృశ్యం

పుల్లంపేట : ప్రముఖ రచయిత శ్రీ రామదాసు పద్మనాభయ్యను సేవా సంస్థల అధినేత, అధ్యాపక బృందం, ప్రముఖులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఈయన రచించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అవతార మహిమ కాలజ్ఞానం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బికె మణి, డాక్టర్ జె.చలమయ్య, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరల పంటల సాగు లాభదాయకం


ఆకుకూరల పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజ

సిద్దవటం : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న ఆకుకూరల పంటలు లాభాలు చేకూరుస్తాయని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె రైతుసేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించడం జరిగింది. జనుము విత్తనాలకు రైతుల నమోదు ప్రక్రియను గమనించారు. అనంతరం మాట్లాడుతూ విత్తనాల కోసం నమోదు చేసుకొని డబ్బులు చెల్లించిన వారికి మంగళవారం నుంచి విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ రైతుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. నందలూరు లక్ష్మీనారాయణ అనే కౌలు రైతు సాగుచేసిన ఆకుకూరల పొలాన్ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆకుకూరల పంటలు లాభాదాయకమని, 365 రోజులు పంటల సాగుకు ఆకుకూరలతోనే సాధ్యమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జ్యోతి చిన్నక్క, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

పల్లకిలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు


అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు రంగురంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఈ పల్లకీలో సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

అన్నదాతకు అపార నష్టం


గాలి తాకిడికి విరిగిపోయిన అరటి చెట్లను చూపుతున్న రైతు రెడ్డప్పరెడ్డి


నేలవాలిన మొక్కజొన్న పంట

తంబళ్లపల్లె : మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న గాలి, వానలతో అన్నదాతకు అపార నష్టం వాటిల్లింది. ఆదివారం సాయంత్రం గాలి,వాన బీభత్సవం సృష్టించింది. తంబళ్లపల్లెకు చెందిన రెడ్డప్పరెడ్డి, లోకేశ్వరరెడ్డి, రాజారెడ్డిలు కలిసి రెండు ఎకరాల్లో అరటి తోట సాగుచేశారు. అరటిగెలలు కోతకు వచ్చే సమయంలో విపరీతమైన గాలి తాకిడికి తోట నేలమట్టమైంది. దీంతో సుమారు రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరో రైతు రామచంద్ర రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కోతకు వచ్చే సమయంలో గాలి,వానతో మొక్కజొన్న పంట పూర్తిగా నేలవాలి నష్టవాటిల్లినట్లు వాపోయారు. ప్రభుత్వం స్పందించి పంటనష్టం పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

సాకర్ టోర్నమెంట్ విజేత డీఎఫ్‌ఏ జట్టు

మదనపల్లె సిటీ : స్థానిక సీఎస్‌ఐ మిషన్‌కాంపౌండ్‌లో ఆరాధన సాకర్ ఫుట్‌బాల్ టోర్నమెంటు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో బీఎస్‌సీ, డీఎఫ్ఏ జట్లు పోటీపడ్డాయి. బీఎస్‌సీ టీమ్‌కు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ ప్రాతినిధ్యం వహించగా, డిఎఫ్ఏ టీమ్‌కు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళీధర్ ప్రాతినిధ్యం వహించారు. హోరాహోరీగా జరిగిన పోటీలో డీఎఫ్ఏ జట్టు 3-4 గోల్స్‌తో బీఎస్‌సీ జట్టుపై విజయం సాధించింది. గెలుపొందిన విజేతను ట్రోఫీ,మెడల్స్,ప్రోత్సాహక నగదును అందజేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జాన్ కమలేష్, అభిలాష్, మహేంద్రనాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో న్యాక్ ఆన్‌లైన్ పర్యటన

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ అక్రెడిటేషన్‌లో భాగంగా భాగంగా పీయర్ టీమ్ ఆన్‌లైన్ పర్యటనను నిర్వహించింది. సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ పర్యటన మరో రెండు రోజులపాటు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి తెలిపారు. మొదటిరోజు మూల్యాంకన ప్రమాణం (క్రైటీరియాల)పై వివరణాత్మక సమీక్షను నిర్వహించారు. అనంతరం ఇతర క్రైటీరియాలపై సమీక్షలు జరిగాయి. విద్యా ప్రమాణాలు, సేవా కార్యక్రమాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై పీయర్ టీమ్ సవివరమైన సమాచారం సేకరించింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక వర్గం, నాన్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు. పియర్ టీమ్ సూచనలు, అభిప్రాయాలు తీసుకొని కళాశాల అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.కిరణ్ కుమార్‌లు పేర్కొన్నారు.

గజ వాహనంపై ఏనుగు మల్లమ్మ

బి.కొత్తకోట : మండలంలోని హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగు మల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండోరోజూ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం విశేష అభిషేకాలు, అర్చనలు, మహా మంగళహారతి కార్యక్రమాలకు భక్తులు, స్థానికులు హాజరయ్యారు. ఏనుగుమల్లమ్మకు ప్రత్యేక అలంకరణలు చేయగా ప్రజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. వీరికి తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం ఏనుగుమల్లమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో కొలువుదీర్చి గజ వాహనంపై ఊరేగించారు. కొండపై జరిగిన ఊరేగింపుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.